
అయిజలో భారీ శివుడి విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు


ఆత్మకూరులో పూజలు చేస్తున్న మహిళలు


అలంపూర్‌లో తుంగభద్రా నదిలో కార్తీక దీపాలను వదులుతున్న భక్తులు


బుద్దారం గండి ఆంజనేయ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేస్తున్న భక్తులు


మల్దకల్ ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు


బీచుపల్లిలో కృష్ణానదిలో పుణ్యస్నానాలాచరిస్తున్న భక్తులు


బీచుపల్లి కోదండరామాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేస్తున్న భక్తులు

# ఆలయాలకు కార్తీక శోభ

- **కార్తీక దీపాలను వెలిగించిన భక్తులు**

నెట్‌వర్క్ నమస్తే తెలంగాణ, నవంబర్ 15 : జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాలో ఆయా మండలాలు, వివిధ గ్రామాల్లోని ఆలయాలకు కార్తీక శోభ సంతరించుకున్నది. శుక్రవారం కార్తీక పౌర్ణమి కావడంతో తెల్లవారు జామునే భక్తులు శివాలయాలకు చేరుకొని కార్తీక దీపాలను వెలిగించి, పరమశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి అలయాలకు భక్తులు పోటెత్తారు. ముందుగా భక్తులు తుంగభద్రానదిలో పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించి నదిలో వదిలారు. స్వామి, అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. అమ్మవారి అలయం ఎదుట, ఉసిరి చెట్టు కింద, శివాలయాల్లో మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. అలాగే బీచుపల్లి క్షేత్రంలో భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానమాచరించి నదిలో కార్తీక జ్యోతులను వదిలారు. కోదండరామాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో భక్తులు, మహిళలు ఉదయాన్నే నది స్నానాలు ఆచరించి శివుడికి గంగా జలంతో అభిషేకం చేశారు. మహిళలు నదిలో దీపాలు వదిలి మొక్కులు చెల్లించుకున్నారు. నోములు ఉన్న వారు వ్రతాలు చేసుకోగా మహిళలు తులసి చెట్టుకు ప్రత్యేక పూజలు చేసి తమ భక్తిని చాటుకున్నారు. నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం, శివాలయంలో కోటి దీపోత్సవంలో భాగంగా మహిళలు, చిన్నారులు స్వామి వారి ఆలయం చుట్టూ దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. మల్దకల్ మండలకేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అర్యవైశ్య సంఘం అధ్వర్యంలో లక్ష దీపాలను వెలిగించారు. పౌర్ణమి సందర్భంగా స్వామి ఆలయంలోని కల్యాణ మంటపంలో భూలక్ష్మి, శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. అయిజ పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో తులసిమాతకు భక్తులు విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అయిజ పట్టణంలోని ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవిసమేత ధన్వంతరి వేంకటేశ్వర స్వామి కల్యాణం వేద పండితుల వైభవంగా నిర్వహించారు. అయిజ పట్టణంలో భారీ శివుడి విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, కార్తీక దీపాలను వెలిగించారు. గట్టు మండల కేంద్రంలోని అంబాభవానికి ఆలయంలో ఎస్‌ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో కార్తీకమాసం సందర్భంగా లక్ష దీపార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గోపాల్‌పేట మండలంలో బుద్దారం గండి ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం ఆంజనేయస్వామికి ఆకుపూజలు, ఆలయ ఆవరణలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు, మహిళలు దీపోత్సవం చేశారు. ఆత్మకూరు పట్టణంలోని బాలబ్రహ్మేశ్వరస్వామి, స్పటిక లింగేశ్వరస్వామి, కోట్ల ఆంజనేయస్వామి, నీలకంఠేశ్వరస్వామి ఆలయం, షిరిడి సాయిబాబా మందిరాలలో భక్తులు దీపాలు వెలిగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాయిత్రియాదవ్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి పల్లకీసేవలో పాల్గొని జ్వాలా తోరణాన్ని ప్రారంభించారు. భక్తులు జ్వాలాతోరణంలో ప్రదక్షిణలు చేస్తూ మొక్కులు చెల్లించుకున్నారు.


గద్వాల పట్టణంలోని నది అగ్రహారం వద్ద నదిలో దీపాలు వదులుతున్న భక్తులు

## ఐదో శక్తిపీఠాన్ని అభివృద్ధి చేస్తా


ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

- **ఎమ్మెల్యే విజయుడు**

అలంపూర్ చౌరస్తా, నవంబర్ 15: ఐదో శక్తి పీఠాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే ఆలయంలో బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబకు ప్రత్యేక పూజలు చేశారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజలకు ఏ సమస్య వచ్చిన వారి వెన్నంటే ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శుక్రవారం అలంపూర్‌చౌరస్తాలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అలంపూర్, వడ్డేపల్లి, మానవపాడు మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు వచ్చాయని వారికి పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కిశోర్, నాగేశ్వర్‌రెడ్డి, శేషిరెడ్డి, సాయిచరణ్‌రెడ్డి, రుక్కు, రఘురెడ్డి, బీఆర్‌ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల త్యాగాలు మరువలేనివి


రైతులకు పరిహారం చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

- **ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి**

గద్వాల, నవంబర్ 15 : ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన రైతుల త్యాగాలు ఎన్నటికీ మరువలేనివని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గద్వాల మండలంలోని రేకులపల్లి గ్రామానికి చెందిన రైతుల భూములు ప్రాజెక్టు నిర్మాణంలో కోల్పోగా శుక్రవారం వారికి ప్రభుత్వం నుంచి వచ్చిన నష్టపరిహారాన్ని రైతులకు ఎమ్మెల్యే అందజేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో 90 మంది రైతులు తమ భూములు కోల్పోగా మొదటి విడుతగా 46మంది రైతులకు రూ.5కోట్ల 40లక్షలు రాగా రైతులకు చెక్కులు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూములు విలువైనవి అయినప్పటికీ ప్రజల సంక్షేమం కోసం రైతులు తమ భూములు ఇచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సుభాన్,నాయకులు గడ్డంకృష్ణారెడ్డి, బండారి భాస్కర్, రమేశ్‌నాయుడు,ప్రతాప్‌గౌడ్, హనుమంతు రెడ్డి, కుర్మన్న, ధర్మనాయుడు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పేరుతో పంట పొలాలు లాకోనవద్దు

గద్వాల అర్బన్,నవంబర్ 15 : అభివృద్ధి పేరుతో తమ భూములు లాక్కోవాలని చూస్తున్నారని, తమను ఆదుకోవాలని రాజోళి మండల ప్రజలు ఎంపీ డీకే అరుణతో గోడు వెలబోసుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో రాజోళి మండలానికి చెందిన ప్రజలు కలిసి సమస్యను పరిష్కరించాలని శుక్రవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇథనాల్ పరిశ్రమ వస్తే తమ గ్రామాలకు రేడియేషన్ సమస్యలు వస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్య తెలుసుకున్న ఎంపీ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇథనాల్ పరిశ్రమకు కేంద్రమే అనుమతి ఇచ్చిందంటూ వస్తున్న ఆరోపణలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పరిశ్రమ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రపోజల్ పెట్టకుండానే అనుమతి ఇస్తదా...అని ప్రశ్నించారు. బాధితులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించకుండా ఇథనాల్ పరిశ్రమ పనులు మొదలు పెట్టవద్దని అధికారులకు సూచించినట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.

NT-338958-All

**ప్రకటన**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


ఎల్లస్వామి ( ఫైల్)

రేవల్లి, నవంబర్ 14: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గొల్లపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకున్నది. ఎస్సై రాము కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఎల్లస్వామి రెండు రోజులుగా కనబడకపోవడంతో చుట్టూ పక్కన, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య రాజమ్మ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం గొల్లపల్లి శివారులోని ఓ బావిలో వ్యక్తి మృతదేహం కనబడడంతో రాజమ్మకు స్థానికుల సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని గుర్తించడంతో పోస్టుమార్టం నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

### వ్యక్తిపై దాడి : కేసు నమోదు

వడ్డేపల్లి, నవంబర్ 15: అవసరానికి ఇచ్చిన డబ్బులు తిరిగి అడిగినందుకు వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. ఎస్సై సంతోష్ కథనం ప్రకారం రామాపురం గ్రామానికి చెందిన మద్దిలేటి అదే గ్రామానికి చెందిన భాస్కర్‌కు రూ.2వేలు బదులు ఇచ్చాడు. గురువారం అప్పు అడగడానికి వెళ్లగా అతనిపై భాస్కర్ దాడి చేయగా గాయాలయ్యాయి. బాధితుడి సోదరుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

### రేషన్ బియ్యం పట్టివేత

ఖిల్లాఘణపురం, నవంబర్ 15: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసిన ఘటన మండలకేంద్రంలో చోటుచేసుకున్నది. ఎస్సై సురేశ్‌గౌడ్ కథనం ప్రకారం శుక్రవారం మండలంలోని తిరుమలాయపల్లి గ్రామ బస్టాండ్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా మహబూబ్‌నగర్ నుంచి ఖిల్లాఘణపురం వైపు బొలెరో వాహనంలో డ్రైవర్ గొల్ల ప్రవీణ్ 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకొని విచారించగా మహబూబ్‌నగర్‌లో గంజి రఫీక్ దగ్గర నుంచి కొనుగోలు చేసి ఖిల్లా ఘణపురాకి చెందిన కార్తీక్‌కు అమ్మడానికి తీసుకెళ్తున్నానని చెప్పాడు. ఈ వాహనాన్ని , రేషన్ బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### బాధితులకు సెల్ ఫోన్లు అప్పగింత


బాధితులకు సెల్‌ఫోన్‌లకు అప్పగిస్తున్న ఎస్సై సురేశ్‌గౌడ్

ఖిల్లాఘణపురం, నవంబర్ 15 : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులు తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సురేశ్‌గౌడ్ తెలిపారు. మండలంలోని రాంపల్లి గ్రామానికి చెందిన పట్నం చిన్నయ్య, సూరాయపల్లికి చెందిన ఎం.డీ రజాక్ సంసాంగ్ ఫోన్ రూ.25వేలు, వీవో వై28 రూ.16,500 విలువ గల ఫోన్లను పోగొట్టుకున్నట్లు చెప్పారు. వారు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రికవరి చేసి శుక్రవారం బాధితులను అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

### ధరూర్ మండలంలో..

ధరూరు, నవంబర్ 15 : బాధితులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరి చేసి బాధితులకు అప్పగించినట్లు ఎస్సై అబ్దుల్ షుకూర్ తెలిపారు. మండలానికి చెందిన విజయలక్ష్మి, గోవిందు గతేడాది ఆగస్టులో వేర్వేరు చోట్ల సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. ఈ మేరకు పోలీసులను ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ సిస్టమ్ ద్వారా శోధించి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని శుక్రవారం బాధితులకు అందజేసినట్లు ఎస్సై తెలిపారు.


సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుడికి మొబైల్ అందజేస్తున్న ఎస్సై అబ్దుల్ షుకూర్

## గిరిజనులపై పెట్టిన కేసులు వెంటనే ఎత్తివేయాలి

- **బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు చంద్రశేఖర్‌నాయక్**


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు చంద్రశేఖర్‌నాయక్

వనపర్తి టౌన్, నవంబర్ 15 : లగచర్ల గ్రామంలో గిరిజనులు వారి భూములు కాపాడుకోవడానికి నిరసన చేస్తే వారిని ఉగ్రవాదుల్లాగా అర్ధరాత్రి అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు చంద్రశేఖర్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డికి సీఎం పదవి గిరిజనులు పెట్టిన భిక్ష అని అది మరిచి వారిపై దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. గత ప్రభుత్వం రిజర్వాయర్ల కోసం భూసేకరణ చేస్తే గ్రామాలకు వచ్చిన అధికారులు తరిమికొట్టండి అని చెప్పింది మీరు కాదా అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ఫార్మసీ కంపెనీ వల్ల గిరిజన జీవనాధారం పోయి విష వాతావరణం వచ్చి వారి బతుకులు చిత్రమవుతాయని ఆ ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనులను బీఆర్‌ఎస్ కాపాడుకుంటుందని అందుకోసం మానవహక్కుల కమిషన్, హైకోర్టు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ వారు సుమోటగా కేసు నమోదు చేసి గిరిజనులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకుడు నందిమల్ల అశోక్ ఉన్నారు.

## నిత్యాన్నదానానికి భారీ విరాళం


విరాళం అందజేస్తున్న కవిందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

మదనాపురం, నవంబర్ 15 : కొత్తకోట, మదనాపురం మండల శాఖ ఆధ్వర్యంలో కొత్తకోట పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన సత్రానికి ఓ భక్తుడు భారీ విరాళం అందజేశాడు. రాయినిపేట గ్రామానికి చెందిన ఎద్దుల కవిందర్‌రెడ్డి అన్నదాన సత్రానికి రూ.2,16,116 విరాళం ప్రకటించి శుక్రవారం కమిటీ సభ్యులకు అందజేశారు. అన్నదాన క్షేత్ర వ్యవస్థాపకుడు గోపాలకృష్ణ గురుస్వామి సమక్షంలో కవిందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు లత, సాయి సిద్దార్థరెడ్డి, సింహాద్రి రెడ్డితో కలిసి కమిటీ అధ్యక్షుడు దూపం నాగరాజు, కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ గురుస్వామి మాట్లాడుతూ దాతల సహకారంతో 11సంవత్సరాలుగా కార్తీక మాసంలో ప్రారంభమై సంక్రాంతి పండుగ వరకు నిత్యాన్నదా న కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, సీనియర్ గురుస్వాములు పాల్గొన్నారు.

## బాధితుడికి ఎల్‌వోసీ అందజేత


బాధితుడికి ఎల్‌వోసీ అందజేస్తున్న చిన్నారెడ్డి

ఖిల్లాఘణపురం, నవంబర్ 15: మండల కేంద్రానికి చెందిన బండారు వెంకటేశ్ ఆనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ప్రభుత్వం నుంచి రూ.2.50లక్షల ఎల్‌వోసీ మంజూరు కాగా శుక్రవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి హైదరబాద్‌లోని ప్రగతి భవన్‌లో బాధితుడు వెంకటేశ్‌కు, కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల సెల్ అధ్యక్షుడు గంజాయి రమేశ్, అజీమ్ ఉన్నారు.

### చిన్నారెడ్డికి వినతి

వనపర్తి టౌన్, నవంబర్ 15: సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని శుక్రవారం టీఎస్‌ఎస్‌యూఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కలిసి ఆ సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. 2025–26 పీఏబీకి సంబంధించి ఈ సారి ప్లానింగ్ అప్రూవల్ బోర్డు లోనే మాకు న్యాయం జరిగేలా చూడాలని చిన్నారెడ్డిని కోరినట్లు ఆ సంఘం నేతలు తెలిపారు. వెంటనే చిన్నారెడ్డి స్పందిస్తూ ఎడ్యుకేషన్ కమిషనర్‌తో మాట్లాడి ఫైల్ రెడీ చేయమని కోరారని తెలిపారు. అదేవిధంగా సీఎం దృష్టికి తీసుకెళ్లి మీకు న్యాయం చేస్తానని చెప్పి ఫైల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌కి పంపించారని చెప్పారు. కార్యక్రమంలో టీఎస్‌ఎస్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, అధికార ప్రతినిధి పడాల రవీందర్, రాష్ట్ర కోశాధికారి దుర్గం శ్రీనివాస్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ చందు భట్టు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన


కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

వనపర్తి టౌన్, నవంబర్ 15 : వనపర్తి మండలంలోని చిట్యాల, వెంకటాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు పరిశీలించారు. ముందుగా కొనుగోలు కేంద్రంలోని వసతులను పరిశీలించి రైతులను మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించి కొనుగోలు చేస్తుందని , అదేవిధంగా సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ కూడా రైతుల అకౌంట్లలో జమ చేస్తుందన్నారు. రైతులు పండించిన పంటను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, కేంద్రాల నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

## చేతిరాళ్ల పోటీల విజేతలకు నగదు అందజేత


విజేతకు నగదును అందజేస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బాసు హన్మంతు

గట్టు, నవంబర్ 15 : మండలంలోని తారాపురంలో మారెమ్మ గ్రామ దేవత జాతర సందర్భంగా చేతిరాళ్ల పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ, పంచమ విజేతలుగా వరుసగా మాల్యాబాద్ నిజాం, కుక్కునూర్ అంపయ్య, ఎల్లందొడ్డి రాముడు, హనుమంతు నిలిచారు. వీరికి వరుసగా రూ.6,016, రూ.4,016, రూ.3,000, రూ.2,000, రూ.1,000 నగదును బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బాసు హన్మంతు శుక్రవారం పంపిణీ చేశారు. అంతకుముందు అమ్మవారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శివప్ప, రామునాయుడు, రాజునాయుడు, గొల్ల తిమ్మప్ప, నర్సిరెడ్డి, రవిగౌడ్,. సోమేశ్, మహేశ్, కడియాల నర్సింహులు పాల్గొన్నారు.

## గ్రూప్- 4లో ఉద్యోగం సాధించిన అంధుడు


బొంగు రమేశ్

పెబ్బేరు, నవంబర్ 15 : పెబ్బేరు అంబేద్కర్‌నగర్‌కు చెందిన అంధుడు బొంగు రమేశ్ ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో టీచర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అయితే తాజాగా గ్రూప్–4 ఫలితాల్లోనూ సత్తా చాటి రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. ఈనేపథ్యంలో ఆయన మాట్లాడుతూ గ్రూప్–4 సాధించినందుకు సంతోషంగా ఉందన్నారు. అయితే తాను టీచర్‌గానే కొనసాగు తూ పేద విద్యార్థులకు విద్యాబుద్ధు లు నేర్పు తానని తెలిపారు.

### సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి

- **కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి టౌన్, నవంబర్ 15: గ్రూప్–3 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నిర్దేశించిన సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 8,132 మంది అభ్యర్థులకు గానూ 31పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నవంబర్ 17న పేపర్–1 ఉదయం 10గంటలకు , పేపర్–2 పరీక్ష మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. నవంబర్ 18న పేపర్–3 పరీక్ష ఉదయం 10గంటల నుంచి ప్రారంభం కానుండగా ఉదయం 8:30గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి వచ్చేటప్పుడు తప్పనిసరిగా హాల్ టికెట్‌తోపాటు ఆధార్‌కార్డు లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులను చెక్ చేసి కేంద్రంలోకి పంపించడం తదితర ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నట్లు తెలిపారు.

### దర్గా వద్ద మౌలిక వసతులు కల్పించాలి

వనపర్తి టౌన్, నవంబర్ 15: జిల్లా కేంద్రంలోని నల్ల చెరువు కట్టపై గల మహబూబ్‌సాని దర్గా వద్ద మౌలిక వసతులు ప్రభుత్వం కల్పించాలని బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకుడు షేక్ జహంగీర్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సొంత ఖర్చుతో నల్ల చెరువు కట్టపై దర్గా నిర్మాణాన్ని చేపట్టారని , ఈ నిర్మాణంలో ఆయన ఆదేశానుసారం ఎక్కడా కూడా తగ్గకుండా నిర్మాణాన్ని పకడ్బందీగా చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా అందులో మంచినీటి సదుపాయం, మొక్కులు తీర్చుకోవడానికి షెడ్డు నిర్మాణం జరిగి ప్రతి గురువారం గ్యార్వీ పండుగ నిర్వహించుకోవడానికి అన్ని హంగులతో నిర్మాణం జరగాల్సి ఉండగా శాసనసభ ఎన్నికల దృష్ట్యా నిర్మాణం దర్గా వద్దనే ఆగిపోయిందని అన్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టిసారించి ప్రభుత్వం తరుపున మంచినీటి సదుపాయం, షెడ్డు, ప్రహరీ నిర్మాణం చేపట్టి ప్రజలకు పూర్తిగా అన్ని వసతులతో దర్గాను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

### ఉద్యోగస్తుల కుటుంబం


జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించిన రాజ్‌కుమార్

గట్టు, నవంబర్ 15 : లైన్‌మెన్‌గా పనిచేస్తున్న గట్టుకు చెందిన బొజ్జయ్య కుటుంబం ఉద్యోగస్తుల కుటుంబంగా పేరొందింది. ఆయనకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. బొజ్జయ్య విద్యుత్‌శాఖలో ఉద్యోగం చేస్తున్నారు. మొదటి కుమారుడు రాజ్‌కుమార్‌కు మొదటగా కానిస్టేబుల్‌గా(స్పెషల్ పోలీస్) అవకాశం వచ్చింది. తరువాతి నియామకాల్లో కానిస్టేబుల్(ఫైర్ డిపార్ట్‌మెంట్)గా ఉద్యోగం సాధించాడు. ఈ ఉద్యోగం చేస్తున్న క్రమంలో తాజాగా వెలువడిన గ్రూప్–4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్(కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్)గా ఎంపికయ్యారు. రెండో కుమారుడు తేజకుమార్ సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో టీజీటీగా ఎంపికై ఉద్యోగం చేస్తున్నాడు. రాజ్‌కుమార్ భార్య అభిజ్ఞ గురుకుల పాఠశాల/కళాశాలలో జేఎల్ ఉద్యోగం సాధించింది. బొజ్జయ్య కుమార్తె లీసాకుమారి కూడా బీఫార్మసీ పూర్తి చేసింది. ఆమె కూడ ఉద్యోగ వేటలో ఉన్నారు.

### సర్వేలో తప్పులు లేకుండా చూడాలి

పాన్‌గల్, నవంబర్15:ప్రభుత్వం చేపట్టిన కులగణనలో తప్పులు లేకుండా చూడాలని ఎంపీడీవో గోపాల్‌రావు కోరారు. మండలంలోని బండపల్లి, వెంగళాయిపల్లి గ్రామాల్లో శుక్రవారం చేపడుతున్న సమగ్ర కులగణన సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే అన్ని వివరాలు సేకరించాలన్నారు.